

నర్సింహులపేట : పత్తితండాలో వర్షానికి పడిపోయిన మిరుప మొక్కలను సరి చేస్తున్న రైతు



డోర్నకల్‌లో వర్షానికి తడిసిన వరి మెదలు



బయ్యారం : కల్లంలో ఉన్న ధాన్యం

# అకాల వర్షం.. అపార నష్టం

- చేతికొచ్చిన పంట వర్షార్పణం..
- తడిసిన ధాన్యం.. వాలిపోయిన వరి, మిర్చి
- తుఫాన్‌తో రైతులకు నష్టం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

నర్సింహులపేట, డిసెంబర్ 6 : తుఫాన్ కారణంగా మూడు రోజులుగా గాలివానతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేతికొచ్చిన ధాన్యం తడిసి పోవడంతో అన్నదాతలు దిగులు పడుతున్నారు. వర్షానికి ధాన్యం తడవకుండా వేసిన టార్పాటిన్లు, పరదాలు గాలికి కొట్టుకపోయి నీరు నిలిచింది. వరి, మిర్చి మొక్కలు నేలవాలాయి. చేతికి వచ్చిన పత్తి తడిసిపోవడంతో నల్లబారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### డోర్నకల్‌లో..

డోర్నకల్ : మిగ్‌జాం తుఫాన్‌తో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం రాత్రి ఈదురు గాలితో భారీ వర్షం పడింది. కల్లాలో ఉన్న ధాన్యం తడవకుండా రైతులు టార్పాలిన్లు, పట్టాలు కప్పుకున్నారు. మిర్చి తోటలు ఈదురు గాలికి నేలకు వాలాయి. అకాల వర్షంతో తీవ్ర నష్టం కలిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు పంట నష్టం అంచనా వేసి నష్ట పరిహారం అందించాలని రైతులు కోరారు.

### బయ్యారంలో..

బయ్యారం : మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. చేతికొచ్చిన మక్కజొన్న, వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురు గాలులతో వరి నేల వాలి నీటిలో తడిసి పోయింది. పలు గ్రామాల్లో ఆరబోసిన మక్కలు తడిసాయి. రైతులు టార్పాలిన్లు కప్పిన ఫలితం లేకుండా పోయింది. వ్యవసాయ అధికారి రాంజీ నాయక్, ఏఈవో సురేశ్ పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. తుఫాన్‌తో వాతావరణం చల్లబడడంతో ప్రజలు బయటికి రావాలంటే జంకుతున్నారు.

### రైతులకు నష్టం పరిహారం ఇవ్వాలి

గార్ల : తుఫాన్‌తో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని సీపీఐ నాయకుడు రాగం రమేశ్ కోరారు. బుధవారం గోపాల పురం, మద్దివంచ, పోచారం, పినిరెడ్డి గూడెం, పోచారం గ్రామాల్లో వరి పంట పొలాలు, మిర్చి తోటలను సీపీఐ నాయకులు పరిశీలించారు. రైతులకు పంట నష్టం విలువ అంచనా వేసి నష్ట పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

### దంతాలపల్లిలో..

దంతాలపల్లి : వర్షం, ఈదురు గాలులతో చేతికొచ్చిన వరి పంట నేలపాలయ్యింది. ఇప్పటికే వరి కోసిన రైతుల కల్లాల్లో ధాన్యం తడవకుండా ఉండడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కుమ్మరికుంట్లలో వర్షానికి ఇంటి గోడ కూలింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మండల వ్యాప్తంగా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. తుఫాన్‌తో పెరిగిన చలికి ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు.

### కురవిలో..

కురవి : లక్షల్లో పెట్టుబడి పెట్టిన రైతులకు చేతికొచ్చిన పంట ఆగం కావడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యం, నేలపై పడిన మిర్చి తోటలు ప్రభుత్వం సర్వే చేసి నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. తాట్యి తండాలో రైతు బోడ దేవేందర్ మిర్చి పంట పూర్తిగా నేల వాలింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరాడు.

### మరిపెడలో..

మరిపెడ : రెండు రోజులుగా తుఫాన్ ప్రభావం కారణంగా కురుస్తున్న వర్షల ప్రభావంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వర్షపు నీటితో పొలం మడుల్లో నీరు నిలిచి వరి మెదళ్లు దెబ్బతింటున్నాయి. అరుగాలం కష్టపడి పండించిన పంటలు కండ్ల ముందర దెబ్బతినడంతో రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

### చిన్నగూడూరులో..

చిన్నగూడూరు : వరికోతలతో బిజీగా ఉన్న రైతుకు తుఫాను వణుకు పుట్టిస్తుంది. వరికో కోసి కల్లాల్లో వడ్లను ఆరబెడుతున్న రైతులు వాటిని కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. మరికొందరు రైతుల వరి కోతకు సిద్ధంగా ఉండి వర్షానికి నేల వాలుతుండడంతో మొలకలు వచ్చే ప్రమాదం ఉందని దిగాలు పడుతున్నారు. పత్తి, మిర్చి, వరి,కంది పంటలపై తుఫాను ప్రభావంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు తెలుపుతున్నారు. ధాన్యం తడిసిపోయిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులు ఇలానే కొనసాగితే వడ్లు మొలకెత్తుతాయని తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### నెల్లికుదురులో..

నెల్లికుదురు : తుఫాన్‌తో మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండల వ్యాప్తంగా చాలా మంది రైతులు వరి కోశారు. ఇంకా 10 శాతం మంది రైతులు వరి కోయకపోవడంతో వర్షం, గాలులకు నేలవాలుతున్నది. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మండల వ్యాప్తంగా పలు చోట్ల మిరుప తోటలు నేలకొరిగాయి.

### రైతులను అప్రమత్తం చేసిన అధికారులు

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని ఈదులపూసపల్లి, వేంనూరు, రెడ్యాల, కంబాలపల్లి గ్రామాల్లో వరి మెదలు నీటిలో తడిసి పోయాయి. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. పలు చోట్ల రైతులకు అధికారులు టార్పాలిన్లు అందజేశారు. ఇంక తుఫాన్ ప్రభావం ఉన్నందున రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

### కేసముద్రంలో..

కేసముద్రం : మండలంలో రెండు రోజులుగా ముసురు పడుతున్నది. చలిగాలులతో ప్రజలు వణికిపోతున్నారు. మంగళవారం ఉదయం నుంచి బుధవారం వరకు మండలంలో 58.6 మి.మీ వర్షపాతం నమోదైంది. చెరువులకు నీరు వచ్చి చేరుతున్నది.



దంతాలపల్లి : వర్షం, ఈదురు గాలులకు నేలకు పడిన వరి పంట



కురవిలో ధాన్యంపై టార్పాలిన్లు కప్పిన రైతులు



మరిపెడలో వర్షపు నీటిలో వరి మెదలు



చిన్నగూడూరు : గాలివానకు నేలవాలిన వరి పొలం



మహబూబాబాద్ రూరల్ : తడిసిన వడ్లను ఆరబెడుతున్న రైతులు



గార్ల : తడిసిన వరి మెదలను చూపుతున్న రైతులు

## పాలకుర్తి దేవస్థాన చైర్మన్ రామచంద్రయ్యశర్మ రాజీనామా

పెద్దవంగర, డిసెంబర్ 6: లక్ష్మీనర్సింహస్వామి పాలకుర్తి దేవస్థాన ఆలయ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్యశర్మ తన పదవికి రాజీనామా చేశారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు. రాజీనామా పత్రాన్ని దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్‌కు అందజేసినట్లు తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు ఆలయ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించానన్నారు. దయాకర్‌రావు సహకారంతో ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశామన్నారు. తనకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.



## రైతులు అప్రమత్తంగా ఉండాలి

### తహసీల్దార్ దామోదర్

కేసముద్రం, డిసెంబర్ 6 : మిగ్‌జాం తుఫాన్ కారణంగా వర్షాలు వస్తుండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ దామోదర్, ఏవో వెంకన్న అన్నారు. మండలంలోని కోరుకొండపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కల్లాల వద్ద ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పుకోవాలని సూచించారు. తుఫాన్ ప్రభావం ఉన్నందున వరి కోతలను నిలిపి వేయాలని సూచించారు. మిర్చి, వరి, వేరు శనగ వంటి పంట చేన్లలో నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. వారి వెంట ఎంపీడీవో రవీందర్‌రావు, కేసముద్రం సింగిల్ విండో సీఈవో వెంకటాచలం, రైతులు ఉన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ దామోదర్, ఏవో